క్లుప్తంగా

నిత్యావసర సరకుల పంపిణీ



మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడి చర్చిలో శుక్రవారం పేదలకు నిత్యావసర సరకులు, బియ్యం పంపిణీ చేశారు. సొసైటీ ఆఫ్ విన్సెంట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అశోక్, బాలకిషోర్, యేసుప్రసాద్, హృదయరాజు, సైమన్ పాల్గొన్నారు.

ఏపీ బర్దన్‌కు నివాళి



మంగళగిరి: సీపీఎం నాయకుడు, పోరాట యోధుడు ఏపీ బర్దన్ సేవలు మరువ లేనివని సీపీఐ నాయకులు కొనియాడారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బర్దన్ జయంతి సదర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, చిన్ని సత్యనారాయణ, పిల్లలమర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా ఆదేశాల మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంలో స్వీపింగ్ మిషన్‌తో రోడ్లను శుభ్రం చేశారు. డ్రెయిన్లు డీ సిల్టింగ్, అధిక మొత్తంలో ఉన్న డంపింగ్ యార్డు చెత్తను ఎత్తివేసి, బ్లీచింగ్‌లు చల్లించారు. కాలువలు, డివైడర్‌ల వెంబడి ఉన్న కలుపు మొక్కలు తొలగించారు. పలు ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. విద్యుత్, నీరు ఆదాతో పాటు ప్లాస్టిక్ నిరోధంపై అవగాన కల్పించారు. వాటర్ ట్యాంకుల క్లీనింగ్, క్లోరినేషన్ చర్యలు తీసుకున్నారు. ఎంటీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు కృషి



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పరిసరాల శుభ్రత జాగ్రత్తలు వివరించారు. ఇంటి పరిసరాల్లో దోమల లార్వా ఉన్న నీటిని గుర్తించి, పార బోయించి శుభ్రం చేయించారు. ప్రతి రెండు రోజులకోసారి మంచినీటి కుండలు, బిందెలను శుభ్రం చేసుకోవాలని చెప్పారు. పూల కుండీలు, వాడని కూలర్లలో నీరు నిలిచి ఉండకుండా చూసుకోవాలన్నారు.

నేడు, రేపు ప్రజాదర్బార్ రద్దు

తాడేపల్లిరూరల్ : ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ నివాసం ఉండవల్లిలో నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని శని, ఆదివారంలో రద్దు చేస్తున్నట్లు కార్యాలయ సిబ్బంది శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి మరలా ఎప్పుడు నిర్వహిస్తారో పత్రికా ముఖంగా తెలియజేస్తామని చెప్పారు.

రైలు నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు వద్ద విజయవాడ చెన్నై రైల్వే ట్రాక్‌పై ట్రైన్‌లోంచి ఓ వ్యక్తి జారిపడి గాయపడిన ఘటన శుక్రవారం జరిగింది. విజయవాడ నుంచి కేరళ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ నుంచి దుగ్గిరాల మండలం చిలువూరు దాటిన తర్వాత ఓ వ్యక్తి జారిపడ్డాడు. అది గమనించిన రైతు కూలీలు గేట్ కీపర్ ప్రకాష్‌కు సమాచారం అందించారు. 108 వాహన సిబ్బంది స్పృహ కోల్పోయి రక్తం మడుగులో క్షతగాత్రుడిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తోంది

- డైవర్షన్ పాలిటిక్స్‌లో చంద్రబాబు సిద్ధహస్తుడు
- నేడు శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పూజలు
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వేమారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: రాష్ట్రంలో రాజ్యాంగ పాలన నడవడం లేదని రెడ్ బుక్ పాలన నడుస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి (శంకర్ రెడ్డి) వేమారెడ్డి ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్క వేణుగోపాల స్వామి రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వేమారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుని, పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. తన పాలన విఫలమైనప్పుడు ప్రజల దృష్టిని దారి మళ్లించడంలో చంద్రబాబు సిద్ధహస్తుడన్నారు. తన వంద రోజుల పాలనలో ప్రజలకు ఏమీ చేయలేని చంద్రబాబు తిరుపతి లడ్డూ విషయంలో ప్రజలను పక్కదారి పట్టించి, కులమతాలను రెచ్చగొట్టి మత రాజకీయాలకు ఆజ్యం పోస్తున్నారని మండిపడ్డారు. ఏ తప్పు చేయలేదు కాబట్టే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తిరుపతి లడ్డూ వివాదంపై సీబీఐ విచారణ కోరారని స్పష్టం చేశారు. తమ తప్పు బయటపడుతుందనే భయంతో సిట్ విచారణతో చంద్రబాబు మమ అనిపిస్తున్నారని ఆరోపించారు. సీఎంగా ఉన్న సమయంలో వైఎస్ జగన్ ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షాతో కలిసి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారని, ఐదేళ్లు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించినప్పుడు కూటమి నాయకులు ఎందుకు డిక్లరేషన్ అడగలేదని నిలదీశారు.

నేడు శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో పూజలు

తిరుపతి లడ్డూ ప్రసాదం విశిష్టతను చంద్రబాబు అపవిత్రం చేశారని, ఆయన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు శనివారం పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించనున్నట్లు వేమారెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే పూజలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

సీఎం సహాయ నిధికి విరాళాలు

తాడేపల్లిరూరల్ : రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఉండవల్లిలోని ఆయన నివాసంలో శుక్రవారం వరద బాధితులకు విరాళాలు అందజేశారు. విజయనగరానికి చెందిన లెండి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావు రూ.5 లక్షలు, గుంటూరుకు చెందిన తరుణి అసోసియేట్స్ ప్రతినిధులు రూ.5లక్షలు, మంగళగిరికి చెందిన శిందే లక్ష్మయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు రూ.2 లక్షలు, గుంటూరుకు చెందిన అవినాష్ ఏజన్సీస్ యాజమాన్యం రూ.2 లక్షలు, గన్నవరానికి చెందిన ఎంకే గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ నిర్వాహకులు రూ.లక్ష, ఆదోనికి చెందిన జి.కృష్ణమ్మ రూ.లక్ష, ఎంకే గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ప్రతినిధులు రూ.లక్ష, గుంటూరుకు చెందిన వడ్లమూడి సోమయ్య రూ.60వేలు, మంగళగిరి పెదవడ్లపూడికి చెందిన లూథరన్ చర్చి నిర్వాహకులు రూ.30వేలు, కుప్పంకు చెందిన పి.శివకార్తీక్, పి.మురుగన్ రూ.20వేలు నగదును చెక్కు రూపంలో అందజేశారు. విరాళాలు అందించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు ఆలయంలో వైఎస్సార్ సీపీ నేతల పూజలు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని అంజయ్య కొట్టు సెంటర్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు శుక్రవారం వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ దురుద్దేశంతో తిరుమల ప్రతిష్ఠను, స్వామి వారి వైభవాన్ని, లడ్డూ ప్రసాదాన్ని దెబ్బతీస్తున్న నేపథ్యంలో ఉదయం 9 గంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంస్థల నాయకులు పాల్గొనాలని తెలిపారు.

చలపతిలో ఉచిత పాస్‌పోర్టు మేళా



మేళాను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

మోతడక(తాడికొండ): మోతడకలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఉచిత పాస్‌పోర్ట్ మేళా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు తెలిపారు. లియో గ్లోబల్ ఓవర్సీస్ ఆధ్వర్యంలో కళాశాల లైబ్రరీలో నిర్వహించిన ఈ మేళాలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లియో గ్లోబల్ ఓవర్సీస్ బ్రాంచ్ మేనేజర్ అనూహ్య నర్రా మాట్లాడుతూ యూకే, అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, ఐర్లాండ్, యూరప్, న్యూజిలాండ్ వంటి దేశాలకు వెళ్లి విద్యనభ్యసించే విద్యార్థులకు స్టడీ వీసాపై శిక్షణ ఇచ్చి ఐఈఎల్ టీఎస్ టెస్ట్‌లో మంచి పర్సంటేజీతో విదేశాలకు వెళ్లే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎగ్జామ్స్ డీన్, డాక్టర్ వీవీ సుబ్బారావు, ఆర్అండ్‌డీ డీన్ డాక్టర్ బాల మురళీ కృష్ణ, లియో గ్లోబల్ ఓవర్సీస్ సీనియర్ ఇంటర్నేషనల్ అడ్వైజర్ ఎ.అనిత, సరళ, హర్షవర్ధన్, నాగూర్ బాషా పాల్గొన్నారు.

కౌలును రైతుల ఖాతాల్లో జమ చేయాలి

తాడికొండ: సీఐడీ కేసుల పేరుతో కాలయాపన చేయకుండా అసైన్డ్ రైతులకు మూడేళ్ల నుంచి పెండింగ్ ఉన్న వార్షిక కౌలును వెంటనే వారి అకౌంట్లో జమ చేయాలని సీపీఎం తుళ్లూరు శాఖ మహా సభ శుక్రవారం తీర్మానం చేసింది. తుళ్లూరులో అన్న క్యాంటీన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, దళితుల శ్మశానంలో మెరకలు వేయించాలని శ్మశాన స్థలం నిండిపోయినందున వేరే స్థలం కేటాయించాలని మహాసభలో డిమాండ్ చేశారు. పాబత్తుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మహాసభలో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి పాల్గొన్నారు. సభలో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, నాయకులు పేరం బాబురావు, జొన్నకూటి నవీన్, ప్రకాష్, కుంభ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్వేత

ఫిరంగిపురం: గర్భిణులు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని డాక్టర్ శ్వేత అన్నారు. వేములూరిపాడు గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 87 మందికి వైద్య పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు అందజేశారు. గర్భిణులకు హెబీ, యూరిన్, రక్తపూత పరీక్షలు చేశారు. రక్తశాతం తక్కువ ఉన్నవారికి ఐరన్ సిత్రోజు ఇంజక్షన్ వేస్తామని చెప్పారు. రక్తం అత్యవసరమైన వారిని గుంటూరు వైద్యశాలకు రిఫర్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్ఎం ఆంతోని రాణి, ఎంపీహెచ్ ఏఎం బాబురావు, ఆశా కార్యకర్తలు పద్మ, సుజాత, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మ పాల్గొన్నారు.

ఏడు రోజుల్లో అభ్యంతరాలు తెలపండి

తెనాలిఅర్బన్: మారీసుపేట రెండు గేట్ల మధ్యలోని ఆర్ఆర్ నగర్ వెళ్ళే గ్రావెల్ రోడ్డును రాకపోకలకు గతం నుంచి వినియోగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విస్తృత ప్రజా ప్రయో జనాలను దృష్టిలో ఉంచుకుని దానిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. స్థల విషయంలో ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలు ఉంటే ఏడురోజుల్లో రిజిస్టర్ డాక్యుమెంట్‌లతో పురపాలక సంఘ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అదే విధంగా ఆ స్థలంలో మున్సిపల్ చట్టం 1965లోని 174వ అంశంపై ప్రకారం నోటీసు బోర్డును కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

చిర్రావూరు సీపీఎం కార్యదర్శిగా గోపాలరావు ఎన్నిక



గోపాలరావుకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

తాడేపల్లిరూరల్ : చిర్రావూరు సీపీఎం శాఖ కార్యదర్శిగా బొప్పన గోపాల్‌రావును శుక్రవారం జరిగిన గ్రామ సభలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి పోలక శంకరరావు అధ్యక్షత వహించగా, సీనియర్ నాయకుడు జొన్న శివశంకరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. పుచ్చలపల్లి సుందర్య విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. జొన్న శివశంకరరావు మాట్లాడుతూ ప్రజలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మహా సభ తీర్మానించిందని తెలిపారు. ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ పంట కాలువలో పంట నీరుకు బదులు మురుగునీరు ప్రవహిస్తోందన్నారు. తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, గ్రామ నాయకులు మేడూరి పాములు, పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు, తాడే కొండయ్య, పల్లపాటి సుబ్బారావు, మేడూరి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

తెనాలిలో మౌలిక వసతుల కల్పనకు కృషి



ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 16,17, 20, 30 వార్డులలో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వార్డుల్లో మురుగు కాల్వలను బాగు చేయించి స్ప్రెయింగ్, బ్లీచింగ్ చల్లారు. వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అన్నం పిన్నారావు, దివి అనిత, కొమ్మర బత్తుని జయపాల్, దేసు యుగంధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బేతపూడిలో పశు వైద్య శిబిరం



రైతుకు మినరల్ మిక్చర్ ప్యాకెట్ అందజేస్తున్న పశువైద్యాధికారి పీర్ అహ్మద్

ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి గ్రామంలో శుక్రవారం నుదురుపాడు పశు వైద్యశాల సిబ్బంది పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి పీర్ అహ్మద్ 45 పశువులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. దూడలకు నట్టల నివారణ మందు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు అందించే ఆహారం, నీటి విషయంలో పాడి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మేతకోసం పశువులను మేత కోసం తోలుకెళ్లిన సమయంలో ఎక్కడపడితే అక్కడ మలినాలు ఉన్న నీటిని తాగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఆహారం తీసుకోకుండా ఉన్న పశువును గుర్తించి వెంటనే గ్రామంలోని వెటర్నరీ అసిస్టెంట్‌నకు తెలియజేసినట్లయితే తగిన మందులు అందజేస్తారన్నారు.

వరద బాధితుల కోసం ప్రత్యేక క్యాంపెయిన్

ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను కోల్పోయిన వారి కోసం ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి, ధ్రువీకరణ పత్రాలు, నకళ్లను అందజేయనున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో డ్రైవింగ్ లైసెన్స్, రిజిష్టర్ డాక్యుమెంట్లు, ఆధార్, జనన, మరణ, మ్యారేజ్ సర్టిఫికెట్లు కోల్పోయిన వారు సదరు డాక్యుమెంట్లు, నకళ్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందులకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. సచివాలయం, సంబంధిత కార్యాలయాల్లో ఏడు రోజుల పాటు నిర్వహించనున్న స్పెషల్ క్యాంపులు సెప్టెంబర్ 28, 30వ తేదీల్లో మహానాడు–1, సీతానగరం, అక్టోబర్ 3, 4 తేదీల్లో మహానాడు–2, కొత్తూరు సచివాలయాలు, అక్టోబర్ 3న సలామ్ సెంటర్, బ్రహ్మానందపురం, డోలాస్ నగర్, డ్రైవర్స్ కాలనీ, శివదుర్గాపురం, నులకపేట సచివాయం, అక్టోబర్ 5న చిర్రావూరు, కొలనుకొండ, ప్రాతూరు, 7న పెనుమాక–1, పెనుమాక–2, ఉండవల్లి–1, ఉండవల్లి–2 సచివాయాలు, సెప్టెంబర్ 28న గండాలయ్యపేట, 30న ద్వారకానగర్, అక్టోబర్ 3న బాప్టిస్ట్‌పేట, 4న ఆత్మకూరు–1, 5న చినకాకాని–2 సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలో తెలిపారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వర్సిటీ విద్యార్థులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ ఆధ్వర్యంలో శుక్రవారం దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వర్సిటీ విద్యార్థి విభాగ ఇన్‌చార్జి అధికారి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు ప్రజలకు వివిధ రకాల మెసేజ్‌ల ద్వారా మోసపూరితమైన లింకులను పంపుతున్నారని, వాటిని నొక్కడం వల్ల పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు ఉచితంగా ఇస్తామని మోగిస్తున్నారన్నారు. మొబైల్‌కు వచ్చిన ఓటీపీలను ఎవరికీ చెప్పకూడదని వివరించారు. ఓటీపీల ద్వారా ఖాతాల్లోంచి నగదు మొత్తం దోచుకుంటారని చెప్పారు. విద్యార్థులను వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, డాక్టర్ కె.రాజశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సీఈఏ ప్రొఫెసర్ ఇన్‌చార్జి డాక్టర్ సుబ్రహ్మణ్యం, సీఈఏ కో–ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అభినందించారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి ఉత్సవాలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలోని డాక్టర్ కొత్త రఘు రామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం భగత్‌సింగ్ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ ఉదయ్ కుమార్ విచ్చేసి, భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సంగ్రామంలో భగత్ సింగ్ ప్రదర్శించిన ధైర్యసాహసాలను విద్యార్థులకు వివరించారు. భగత్ సింగ్ 1907 సెప్టెంబర్ 27న జన్మించారని, ఢిల్లీ వీధిలో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్య పరిచారని, విప్లవం వర్ధిల్లాలి అని నినాదాన్ని ఇచ్చారని వివరించారు. స్వాతంత్ర్య సమర యోధుడు లాలా లజపతిరాయ్ హత్య నేపథ్యంలో ఒక పోలీస్ అధికారిని కాల్చినందుకు భగత్ సింగ్‌ను ఉరి తీశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జాన్‌బాబు, కె.గణేష్‌బాబు, బి.శ్రీనివాసరావు, డి.రవికుమార్, ఎస్.అశోక్, కె.ఆర్యన్, కె.సరళాదేవి, ఎన్ఎస్ఎస్ అధికారి రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ గుంటూరు టీం మెంబర్ వాకా లక్ష్మణ్ నందన్ సూచన



హెల్ప్‌లైన్ గురించి వివరిస్తున్న లక్ష్మణ్ నందన్

కొల్లిపర: పిల్లలు, విద్యార్థులు గంజాయి, పొగాకు వంటి మత్తుపదార్థాలకు మొబైల్ గేమ్స్‌కు బానిసలు కాకుండా వాటికి దూరంగా ఉండాలని రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ గుంటూరు టీం మెంబర్ వాకా లక్ష్మణ్ నందన్ అన్నారు. రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్(1098)గుంటూరు, ఐసీడీఎస్ తెనాలి ప్రాజెక్ట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బాలల హక్కులు చైల్డ్‌టోల్‌ఫ్రీ నెంబర్(1098) పై మండలంలోని తూములూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.జయరత్నరాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వాకా లక్ష్మణ్ నందన్ విద్యార్థులతో మాట్లాడుతూ బాల కార్మికత్వాన్ని పూర్తిగా నిర్మూలించడానికి, అక్షరాస్య శాతాన్ని మరింతగా పెంచడానికి సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బడిని వీడిన పిల్లలు లేదా బిక్షాటనలో ఉన్న పిల్లలు ఎవరికైన కనిపిస్తే వెంటనే 1098 కు కాల్ చేసి పూర్తి సమాచారం అందిస్తే అటువంటి వారికి చెందిన తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించి వారిని తిరిగి బడికి పోయేందుకు తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. బాలల హక్కులు, చైల్డ్‌టోల్ ఫ్రీ నెంబర్ 1098 గురించి, సేవా కార్యక్రమాలను, అవశ్యకతను తెలియజేశారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక మాట్లాడుతూ బాల్యవివాహాలు ఎక్కడ జరగకుండా చూడాలని, ఎక్కడన్నా జరుగుతున్న బాలల శిశు సంక్షేమ లేదా రెవెన్యూ శాఖకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని, బాలికలకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే సమాచారం అందించాలని కోరారు. పాఠశాలలో ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారిబాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి ఉపాధ్యాయురాలు వారికి అవగాహన కల్పించి, ప్రయోగాత్మకంగా వివరించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ మహిళా పోలీస్ లక్ష్మి ప్రసన్న, అంగన్వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• అనాథకు అంత్యేష్టి సంస్కారం



అనారోగ్యంతో జిల్లా వైద్యశాలలో మృతి చెందిన అనాథకు శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు శుక్రవారం అంత్యక్రియలను నిర్వహించారు. వివరాల్లోకి వెళితే కె.విజయ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ జిల్లా వైద్యశాలలో చేరాడు. నాలుగు రోజుల తర్వాత అతడు మృతి చెందడంతో త్రీటౌన్ పోలీసులు, 26వ వార్డు కౌన్సిలర్ నూరు ఇస్మాయేల్ ఈ విషయాన్ని శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీనుకు తెలియజేశారు. అతనికి ఎవరు లేరని, అనాథ అని అంత్యక్రియలు నిర్వహించాలని కోరారు. దీంతో వారు బుర్రిపాలెం రోడ్డులోని మహా ప్రస్థానంలో సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మల్లెల వాసు, బి.పోతురాజు పాల్గొన్నారు. –తెనాలి అర్బన్

రేపు తెనాలిలో మాల మేధావుల రౌండ్ టేబుల్ సమావేశం



పోస్టరు ఆవిష్కరించిన జేఏసీ నేతలు

తెనాలి: స్థానిక అయితానగర్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు కమ్యూనిటీ హాలులో ఆదివారం మధ్యా హ్నం 3 గంటలకు జరగనున్న మాల న్యాయవాదులు, ఉద్యోగులు, విద్యావేత్తలు, పట్టభద్రులు, మేధావుల రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తెనాలి డివిజన్ జేఏసీ నాయకులు కోరారు. అదే కమ్యూనిటీహాలులో శుక్రవారం సాయంత్రం రౌండ్‌టేబుల్ సమావేశం పోస్టరును ఆవిష్కరించారు. దళిత హక్కుల సేవా సమితి అధ్యక్షుడు బండికళ్ల బుల్లియ్య మాట్లాడుతూ, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో మాల ఉద్యోగులనే టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వ విధానాలను ఖండిస్తున్నట్లు చెప్పారు. మెడికల్ కౌన్సిల్ ఎస్సీ వర్గీకరణ అమలు ఈ ఏడాది చేయాలని హైకోర్టులో ఎమ్మార్పీఎస్ వేసిన పిటిషన్‌ను తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ వ్యతిరేకించారు. కారుమంచి రవికుమార్, పిల్లి వాసు, కనపర్తి అబ్రహం లింకన్, కంచర్ల కోటేశ్వరరావు, హైకోర్టు అడ్వకేట్ కనపర్తి సాల్మన్ రాజు, సుందర్ సునీల్, తమనం భూషణం, కారుమంచి సునీల్ సందీప్, బొనిగల ప్రదీప్, కంచర్ల నాగభూషణం పాల్గొన్నారు.

కొలకలూరులో నేడు మెగా ఉచిత వైద్యశిబిరం

తెనాలిరూరల్: డొనేట్ ఫర్ పూర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ సౌజన్యంతో జొన్నలగడ్డ స్వర్ణముఖి స్మారక ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక ఏబీఎం, ఆర్‌సీఎం చర్చిల ఎదురుగా నిర్వహిస్తున్న శిబిరంలో ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్‌కు చెందిన అనుభవజ్ఞులైన వైద్యులచే రోగులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా ఇస్తారని చెప్పారు. గుండె, ఊపిరితిత్తులు, నరాలు, కంటి సంబంధిత వ్యాధులతో పాటు, షుగర్, బీపీ వంటి వ్యాధులకు చికిత్స అందించనున్నట్టు తెలిపారు. కొలకలూరు, పరిసర ప్రాంత ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.